వైద్య శిబిరంలో 525 మందికి పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: మండల పరిధిలో కాపవరం గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన హోప్ ఫర్ టుడే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 525 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 30 మంది వైద్యులు పాల్గొని కంటి, దంత, స్త్రీల గర్భకోశ పరీక్షలు చేశారు. సంస్థ ప్రతినిధులు వి.ఇమ్మాన్యుయేల్ రాజు, సుబ్రహ్మణ్యం, చిట్టిరాజు, ఆర్ మునేశ్వరరావు తదితరులు సేవలందించారు.



అక్షయమే జీవనమై



చదలాడలో ఇంటింటికీ తిరుగుతున్న హరిదాసుకు బియ్యం అందిస్తున్న మహిళ, చిన్నారులు

- సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న హరిదాసులు
- మరో పని తెలియక ఉదర పోషణ గగనం
- కళాకారుల పింఛను ఇవ్వాలని వేడుకోలు

పెద్దాపురం: పట్టు పీతాంబరాలు.. మెడలో పూలమాల.. శిరమున అక్షయపాత్ర.. కాళ్లకు మువ్వలు.. స్వరయుక్తంగా శ్రీమన్నారాయణుని కీర్తనలు ఆలపిస్తూ.. వాటికి అనుగుణంగా భుజాన వేలాడే తంబురను ఒకచేతితో.. చేతిలో చిడతలను శృతి శుభగంగా వాయిస్తూ ఉదయ భానుడిలా ఇంటింటికీ తిరిగి మేలుకొలిపే హరిదాసు నేడు దాదాపు కనుమరుగవుతున్నాడు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొందరు వారసులు నాడు పడిన వారి శ్రమ పడలేక ఆ కీర్తనలు ఆలపించలేక.. మోపెడ్‌లపై రయ్యిన తిరిగేస్తూ.. మైక్‌లో కీర్తనల రికార్డులు పెట్టేసి.. అక్షయపాత్రను సైతం వాహనానికే అమర్చి ఇంటింటికీ తిరిగే మోడ్రన్ హరిదాసులే నేడు కనిపిస్తున్నారు.

నెలంతా ఇలా తిరిగి గృహిణులు సమర్పించే బియ్యాన్ని పోగుచేసుకుని ఏడాదంతా గడుపుకోవాల్సిన పరిస్థితి కొందరికి ఉంటుంది. మరో పని రాదు. ఇది తప్ప. ఇదిగో రాష్ట్రం కాని రాష్ట్రం, జిల్లా కాని జిల్లాలో హరిదాసుగా పండుగ వాతావరణాన్ని తీసుకువస్తున్న బొమ్మకంటి వీర రాఘవరావుది అటువంటి పరిస్థితే. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆయన తన తండ్రి నరసింహులు నుంచి ఈ వారసత్వం తీసుకున్నారు. 36 ఏళ్లుగా ఈ మండలంలో పర్యటిస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ధనుర్మాసం నెల రోజులూ మండలంలోని తాటిపర్తి, పులిమేరు, చంద్రమాంపల్లి, చదలాడ, దివిలి, గుడివాడ, కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామాల్లో పర్యటించి వచ్చిన బియ్యంలో కొంత సొంతానికి వినియోగించుకుని, మరికొంత విక్రయించి సొమ్ము చేసుకుని కుటుంబ పోషణ సాగిస్తున్నారు.

కళాకారుడి పింఛన్ మంజూరు చేయాలి



వంశ పారంపర్యంగా వస్తున్న ఈ హరిదాసు వృత్తితోనే కాలం వెళ్లదీస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదు. ఆన్‌లైన్ ఆధార్ లింక్ వల్ల పింఛన్‌కి అర్హత లేదంటున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ప్రభుత్వం నుంచి కళాకారుడు పింఛన్ మంజూరు చేయాలని కోరుతుతున్నాను.

– నీలల నరసింహదాసు,
లంకపల్లి, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



సామర్లకోట జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీలో తలపడుతున్న ఉండూరు, వేట్లపాలెం జట్లు

సామర్లకోట: గ్రామీణ స్థాయి యువతీ, యువకులలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా కొనసాగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టణ పరిధి, మండల స్థాయిలో సచివాలయాల్లో విజయం సాధించిన వారికి మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు క్రికెట్, కబడ్డీ పోటీల్లో పాల్గొన్ని ప్రతిభ చూపారు. పోటీల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ జె రామారావు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజులు పర్యవేక్షించారు. పీడీ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాలకు చెందిన పీఈటీలు ఆటలను ఆడిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు మండల స్థాయిలో ఆటల పోటీలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఎంపీడీఓ శ్రీలలిత తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. రెండో రోజు గురువారం కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన జట్లు నియోజకవర్గస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు

శాంతివర్ధన సేవలకు గుర్తింపు



సభలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

పెద్దాపురం: సామాజిక సేవా కార్యక్రమాల్లో శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలకు మంచి గుర్తింపు ఉందని ఎస్‌ఐ వి.సురేష్, కె.సత్యనారాయణ (న్యూజిల్యాండ్) అన్నారు. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో గురువారం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ రాయవరపు వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సేవలందించడంతో పాటు ఎన్‌జీఓగా సామాజిక సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ఏటా సహకరిస్తున్న దాత, కాకినాడ వీబీవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సత్యనారాయణ సేవాభావాన్ని చాటుకుంటున్నారన్నారు. ఉత్తమ ఎన్‌జీఓగా ఇటీవలే అవార్డు అందుకున్న వీరబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో పాల్గొనడం, ఇటువంటి పిల్లలకు సేవలందించడం చాలా ఆనందంగా ఉందని ఎస్‌ఐ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా పేద వృద్ధులకు ఎస్‌ఐ సురేష్ చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. అనంతరం దాత రూ.2500 విలువ చేసే పౌష్టికాహార కిట్లు, పసుపు, చీర, గాజులుతో సుమారు 30 మంది గర్భిణులకు, ముగ్గురు హిజ్రాలకు ఎస్‌ఐ సురేష్, సంస్థ ప్రిన్సిపాల్ రాయవరపు సత్య, వీరబాబు దంపతులతో కలిసి సామూహిక సీమంతాలు చేశారు. వీబీవీఆర్ ఫౌండేషన్ కౌన్సిల్ సభ్యులు దేవి, పాఠశాల ఏఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఈఓ పీఆర్డీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి హరికృష్ణ సత్యారెడ్డి

సామర్లకోట: జిల్లా ఈఓపీఆర్డీ సంఘ అధ్యక్షుడిగా కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎం. శ్రీరామాంజనేయులు (కాకినాడ రూరల్), ప్రధాన కార్యదర్శిగా కె సూర్యనారాయణ (ఏలేశ్వరం) సహాయ కార్యదర్శి సీహెచ్ ఇందిరాదేవి (కాజులూరు) కోశాధికారిగా యస్‌వీ శ్రీనివాసరావు (కరప) అసోసియేట్ అధ్యక్షుడిగా జి.అరుణ్ కుమార్ (కోటనందూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అంకిత భావంతో పని చేయాలి

- స్టేషన్ మేనేజరు రమేష్

సామర్లకోట: ఆయా శాఖల్లో విధులు నిర్వహించే వారు అంకిత భావంతో పని చేయాలని అప్పుడే పదోన్నతులు వెతుక్కుంటూ వస్తాయని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్స్ మన్‌గా పని చేసిన రాజేష్‌కుమార్ సింగ్‌కు సీనియర్ పాయింట్స్ మన్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ సింగ్‌ను గురువారం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను భీమవరం బదిలీ చేస్తూ రిలీవింగ్ ఆర్డరును అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఎస్, టీటీలు, టీసీలు పాల్గొన్నారు.



రాజేష్‌కుమార్ సింగ్‌కు రిలీవింగ్ ఆర్డరును అందజేసిన స్టేషన్ మేనేజర్ రమేష్

పాస్‌పోర్టు పోయినది

గుండు నరేంద్ర S/o. అప్పలస్వామి అనే నేను సామర్లకోట మండలం వేట్లపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని తెలగపేట, డోర్ నెం.3-30లో నివసిస్తున్నాను. నేను పాస్‌పోర్టు నెం. P 9549438 కలిగిన పాస్‌పోర్టు కలిగి ఉన్నాను. సౌదీ నుంచి వచ్చిన నేను తిరిగి వెళ్ళేందుకు 28-12-2023వ తేదీన నా పాస్‌పోర్టును స్కానింగ్ చేయించుకుని సామర్లకోట నుండి వేట్లపాలెం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు పై అడ్రస్‌కు గాని, క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియజేయగలరు. సెల్: 77939 52809

17న పెద్దాపురం మండల సమావేశం

పెద్దాపురం: మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 10.30 గంటలకు నిర్వహించే మండల సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఎంవీఐ సురేష్‌కు పదోన్నతి

పెద్దాపురం: ప్రస్తుతం పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)గా ఉన్న ఆర్.సురేష్‌కు జిల్లా అధికారిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన జిల్లా రవాణా అధికారికి రిపోర్ట్ చేసి, విజయవాడలోని కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆయనకు ప్రస్తుతం ఏ జిల్లా కేటాయించలేదు. దీంతో విజయవాడ కమిషనరేట్‌లో రిపోర్టు చేసి, పండగ సెలవుల అనంతరం కేటాయించిన జిల్లాలో రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పెద్దాపురంలో ఆయన స్థానాన్ని సంక్రాంతి సెలవుల అనంతరం భర్తీ చేయనున్నట్లు రవాణా అధికారులు తెలిపారు.

కోడిపందేల సమాచారమిచ్చి సహకరించండి

తహసీల్దార్ జితేంద్ర, ఎస్‌ఐ సురేష్



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్‌ఐ

పెద్దాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, గుండాట ఆడితే పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి సహకరించాలని తహసీల్దార్ వి.జితేంద్ర, ఎస్‌ఐ వెలుగుల సురేష్ ప్రజలను కోరారు. మండలంలోని దివిలి, చంద్రమాంపల్లి, పులిమేరు, గుడివాడ, జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో కోడి పందాలే ఆడే ప్రదేశంలో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో ఎటువంటి జూదాలు జరుగకుండా ప్రజలు సహకరించాలన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



అమీనాబాదులో రహదారి చెంతనే పేరుకుపోయిన వ్యర్థాలు



వీధి రోడ్డుపైకి వస్తున్న వ్యర్థాలు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదులో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారులు, ఆలయాలు వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. డ్రైన్లు పూడికతో నిండిపోవడంతో మురుగు ముందుకు పారడం లేదు. పలు ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను గ్రామంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పంచారామ క్షేత్ర ప్రధాన అర్చకుడి మృతి



కొంతేటి జోగారావు (ఫైల్)

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకునిగా విధులు నిర్వహిస్తున్న కొంతేటి జోగారావు (73) తుదిశ్వాస విడిచారు. ఆయన స్వగృహంలోనే బుధవారం మృతి చెందారు. ఆలయంలో ఆయన సుమారు 35 ఏళ్లపాటు సేవలు అందించారు. జోగారావు మృతికి ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు యందమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఆలయ అర్చకులు సంతాపం తెలిపారు.







